జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 1-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 471 పేజీలు: 4 వెల : రూ.7




# రక్తమోడిన రహదారులు

* వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి
* వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు, రోడ్డు దాటుతుండగా మరొకరు
* ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్న హైవే
* అతివేగం కారణంగా హరీ మంటున్న ప్రాణాలు
* నిబంధనలు పాటించని వాహనచోదకులు
* నడిరోడ్డున పడుతున్న కుటుంబాలు
* రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 30 (వార్త):** జిల్లాలో మంగళవారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామ సమీపంలో వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పొందూరు మండలం ఇల్లయ్యగారిపేటకు చెందిన కొంచాడ యశ్వంత్‌కుమార్ (18), కృష్ణాపురం గ్రామానికి చెందిన కెల్ల వెంకటేష్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై పొందూరు నుంచి రాజాం వైపు వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో యశ్వంత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే శ్రీకాకుళం రూరల్ మండల పరిధి పెద్దపాడు ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పెద్దపాడుకు చెందిన బొట్ట సూర్యనారాయణ (65) స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో నైట్‌వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులకు వెళుతూ రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పెద్దపాడు వైపు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

## కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 30 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. వివరాల్లోకి వెళితే.. కానిస్టేబుల్ రవి, భార్య అరసవిల్లి ఝాన్సీ ఎన్‌బీఐ స్టాఫ్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. ఝాన్సీ ఈనెల 27న రాత్రి ఇంటికి తాళం వేసి ముగతం పాలెం వెళ్లి తిరిగి సోమవారం రాత్రి ఇంటికి చేరుకునే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూసి చోరీ జరిగిందని గుర్తించారు. మంగళవారం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రెండు తులాల బంగారం, జత పట్టీలు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఝాన్సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు.

# దసరా ఉత్సవాలకు.. పకడ్బందీగా ఏర్పాట్లు



* సీసీ కెమెరాలు డ్రోన్లతో బందోబస్తు
* ఎక్కడికక్కడ పోలీసు పహారా
* ఆలయాలు, ప్రధాన జంక్షన్లలో అదనపు సిబ్బంది



**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 30 (వార్త):** దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీకాకుళం నగరంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రధాన జంక్షన్లు, దేవాలయాలు, మండపాల వద్ద అదనపు సిబ్బంది మోహరించాయి. ట్రాఫిక్ నియంత్రణ, జనసమ్మర్దం నియంత్రణతో పాటు ప్రయాణికుల రద్దీ ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు, దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలు జరగకుండా పహారా కాస్తున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్రతి ముఖ్య కూడలిలో అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మహిళల భద్రత కోసం శక్తి బృందాలు, పరిస్థితులపై నిఘా కోసం సీసీ కెమెరాల మానిటరింగ్ కూడా ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, మార్కెట్లు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఎస్పీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు మానిటరింగ్ చేస్తున్నారు.

# పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

* నిలిచిన వైద్యసేవలు * ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖాధికారులు




**శ్రీకాకుళం, సెప్టెంబరు 30 (వార్త):** పీజీ సీట్లలో ఇన్ సర్వీస్ కోటా పునరుద్ధరించాలని, పదోన్నతులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ) వైద్యులు సమ్మె బాట పట్టారు. మంగళవారం వైద్యులు విధులు బహిష్కరించి నిరసనలు తెలిపారు. సమ్మెకు పిలుపునిచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘానికి ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) డాక్టర్స్ జేఏసీ మద్దతు తెలిపింది. ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా శ్రీకాకుళం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట వైద్యులు నిరసన తెలిపారు. ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, టైమ్‌బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, సంచార చికిత్స కార్యక్రమానికి నెలకు రూ.5 వేలు ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు. అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్‌ను సరుబుజ్జిలి, పురుషోత్తపురం, బూర్జ, గుత్తావల్లి, అక్కులపేట, తొగరాం, దూసితో పాటు ఆమదాలవలస పట్టణంలోని పలు అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యులు శ్రీకాకుళంలో కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మా సమస్యలను వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు.

## తీరానికి గుర్తుతెలియని మృతదేహం

**సంతబొమ్మాళి, సెప్టెంబరు30 (వార్త):** లక్కివలస పంచాయతీలో గల పిట్టవానిపేట సముద్రపు ఒడ్డుకు మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చింది. మృతదేహం బాగా ఉబ్బి ఉండడంతో కొద్దిరోజుల క్రితం ఎక్కడో మృతి చెంది కెరటాల తాకిడికి ఇక్కడికి చేరి వుండవచ్చని మత్స్యకారులు చెబుతున్నారు. సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.



## అంధకారంలో నివగాం బ్రిడ్జి

**కొత్తూరు, సెప్టెంబరు30 (వార్త):** ఏపీ, ఒడిశా సరిహద్దులో ఉన్న నివగాం వంతెన చీకట్లో మగ్గుతోంది. రాత్రివేళ ఈ వంతెన మీదుగా వెళ్లేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. గత కొంతకాలంగా నివగాం బ్రిడ్జిపై ఉన్న వీధి దీపాలు పనిచేయడం లేదు. ఈవంతెన మీదుగా ప్రయాణించే అధికారులు, రాజకీయ నాయకులు కూడా ఈ సమస్యను పరిష్కరించడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ వంతెనపై లైట్లు వెలిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గ్రామదేవతకు మంత్రి అచ్చెన్న పూజలు

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 30 (వార్త):** నిమ్మాడ గ్రామంలో వెలసిన గ్రామ దేవతను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయమాధవి మంగళవారం దర్శించుకున్నారు. గ్రామ దేవతకు ముర్రాటలు, వస్త్రాలు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. వారి వెంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, గ్రామ ప్రజలు ఉన్నారు.





# శాసనమండలిలో.. నర్తు రామారావు ఆన్‌డ్యూటీ

* ఉత్తరాంధ్ర, జిల్లా సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్సీ
* తెలుగుదేశం ఎమ్మెల్యేల కన్నా మేలు అంటున్న నేతలు
* పుష్కర కాలం ఎమ్మెల్యే అశోక్ స్పందించిన సమస్యలు కన్నా రామారావే నయం
* వైసీపీ నాయకులు ప్రశంసల జల్లు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30 (వార్త):** వైసీపీ ఎమ్మెల్సీ నర్తు రామారావు శాసన మండలిలో ఉత్తరాంధ్రతో పాటు శ్రీకాకుళం జిల్లా సమస్యలపై గళమెత్తి అందరిచేత శభాష్ అనిపించుకున్నారని వైసీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ కారింగి మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలోగల ఎంపిపి చాంబర్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 1983 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి 2004-2009 కాలం మినహా సుమారు 37 సంవత్సరాలు తెలుగుదేశం శాసన సభ్యులే ఇచ్ఛాపురం నుంచి ప్రాతినిధ్యం వహించినా, నియోజకవర్గంలో నెలకొని వున్న సమస్యలు శాసనసభ లో ప్రస్తావించిన సందర్భాలు అరుదు. ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఎం.వి కృష్ణారావు (15 సంవత్సరాలు) బెందాళం అశోక్ బాబు (12 సంవత్సరాలు) మొత్తం కాలంలో ఆసెంబ్లీలో ప్రస్తావించిన మొత్తం సమస్యల కన్నా గత రెండేళ్లలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రస్తావించిన అంశాలే ఎక్కువగా వున్నాయని శాసనసభ, మండలి లెక్కలు చెబుతున్నాయని వారు తెలియజేశారు. నిర్లక్ష్యానికి గురైన ఇచ్ఛాపురంలో పాతుకు పోయిన సమస్యల పట్ల తెలుగుదేశం పార్టీకి పార్టీకి చిత్తశుద్ధి లేదనే విషయం దీని ద్వారా అవగతమౌతుందన్నారు. రాష్ట్రంలోనే 46వేలు తలసరి ఆదాయంలో అట్టడుగున ఉండడానికి గడచిన 37 ఏళ్ళుగా ప్రాతినిధ్యం వహించిన తెలుగుదేశం ఎమ్మెల్యేలే బాధ్యత వహించవలసి వున్నదని అన్నారు. 80 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగానికి అవసరమైన సాగునీటి వనరుల వృద్ధి చేయడంలో జరిగిన నిర్లక్ష్యాన్ని మండలి వేదికగా రామారావు ఎత్తిచూపారని అన్నారు. పైడిగాం ప్రాజెక్టు ఆధునీకరణ, కంచిలి మండలంలో సాగరాల నీటి నిల్వ సామర్థ్యం పెంపు, మరమ్మతులు, బహుదా పరీవాహక ప్రాంతంలో కాలువలు నీటి సరఫరాకి అనువుగా మలచడం వంటి సాగునీటి అవసరాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారన్నారు. కడలి పాలౌతున్న వంశధార నది మిగులు జలాలు ఇచ్ఛాపురం వరకు తీసుకొని రావలసిన ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేశారని చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బెంతుఒరియాలను మోసగించి, వారి ఓట్లతో పదవులు దక్కించుకొని, వారి సామాజిక స్థితి అస్తిత్వాన్ని సందిగ్ధంలో పడవేసిన వైనాన్ని ప్రశ్నించారన్నారు. రైతాంగానికి అందవలసిన ఎరువుల పంపణీలో అలక్ష్యాన్ని, వివక్షాపూరితమైన పంపిణీ విధానాలను నిలదీశారన్నారు. కిడ్నీ వ్యాధుల ప్రభావిత ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, బారువ, సోంపేట ఆసుపత్రులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోని ప్రభుత్వం మంజూరు చేసిన పనులు పూర్తిచేయడం, కిడ్నీ వ్యాధి నియంత్రణకు అవసరమైన డయాలిసిస్ యంత్రాలను వినియోగంలోనికి తీసుకొని రావడం, జనరేటర్ సదుపాయం కలిగించడం, ఆక్సిజన్ సదుపాయం ఆధునీకరించడం గూర్చి ప్రభుత్వానికి తెలియజెప్పారన్నారు. ఉద్దానం ప్రాజెక్టు లో తాత్కాలిక ఉద్యోగులుగా గత 29 సంవత్సరాలుగా పంప్ ఆపరేటర్లుగా పని చేస్తున్న సుమారు 104 మందిని ఒక్క వాట్సాఫ్ క్లిక్‌తో తొలగించిన అన్యాయాన్ని మండలి వేదికగా నిలదీసాశారని చెప్పారు. ప్రభుత్వం తలపెట్టిన నూతన జిల్లాల పెంపు విషయమై ఇచ్ఛాపురం లేదా పలాస కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని సూచించారు. ఇలా అనేకమైన అంశాలను ఇటీవలే ముగిసిన శాసనసభ, శాసనమండలి సమావేశంలో ప్రస్తావించి ఇచ్ఛాపురం ప్రజల ఓట్లుతో శాసనసభ్యులుగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీకి చెందిన శాసనసభ్యుల కన్నా స్థానిక సంస్థల ప్రతినిధిగా ఎన్నికైన ఎమ్మెల్సీ రామారావు ప్రదర్శన ఎంతో మెరుగ్గా వుందని ఇచ్ఛాపురం ప్రజలు కొనియాడుతున్నారని వైస్సార్సీపీ నేతలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో మాజీ కన్వీనర్ ఆశి పురుషోత్తం రెడ్డి, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసీరాం పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త): ఇచ్ఛాపురం** పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా రామకృష్ణ రీడింగ్ రూమ్ అండ్ లైబ్రరీలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో వారికి వైద్య పరీక్షలు చేయించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్, మెడికల్ ఆఫీసర్ అఖిల్ మనోహర్, సచివాలయ పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, వైద్య కార్యదర్శులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

**- డిమాండ్ చేసిన దళిత-ఆదివాసీ-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు**

**- జేపీసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహణ**



**శ్రీకాకుళం, సెప్టెంబరు30(వార్త):** వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని దళితాదివాసీ-బహుజన-మైనార్టీ సంఘాల నాయకులు ముక్తకంఠంతో కోరారు. దళిత-ఆదివాసీ-బహుజన-మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశం నిర్వహణ బాధ్యతలను తైక్వాండో శ్రీను పర్యవేక్షించగా అధ్యక్షుడిగా డా.కంఠ వేణు వ్యవహరించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాటల తూట ఆతవ ఉదయ్ భాస్కర్ తొలుత ఏమై పోదుమో అంబేద్కర్ లేకుంటే అన్న పాటను పాడి సమావేశాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్వహించాలన్న కూటమి సర్కార్ తన నిర్ణయాన్ని ఉపసహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని పక్షంలో ఐక్యంగా పోరాటం సాగించి అణగారిన, బహుజన వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ విధానాలను అమలు చేస్తారని ధ్వజమెత్తారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశం వేదికగా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర వ్యాప్తంగా మరో పోరుకి నాంది కావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తీర్మానించిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని నేతలు స్పష్టం చేశారు. సమావేశంలో వైకాపా యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, వైసీపీ నాయకులు అంధవరపు సూరిబాబు, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్య క్షులు కల్లేపల్లి రామ్‌గోపాల్, దళిత ఆదివాసీ నాయకులు వాబ యోగి, గ్లోబల్ స్కూల్స్ అధినేత ప్రసాదరావు, హ్యూమన్ రైట్ కమిషన్ నాయకులు ఇంజనీర్ ముని శ్రీనివాస్, ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు ముజీమ్, ఎస్సీ, ఎస్టీ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాడాన దేవ భూషణరావు, రెల్లి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రముఖ ఇంజినీర్, హారికా కనస్ట్రక్షన్స్ అధినేత కరణం హారికా ప్రసాద్, పొన్నాడ రవికుమార్, ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సవలాపురపు వెంకటరమణ మాదిగ, రచయిత దుప్పల రవికుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు ఎం.ఏ.రఫీ, కాళింగ సామాజికవర్గ ప్రతినిధి బగాది వెంకటరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు శాసపు జోగినాయుడు, స్వచ్ఛంద సేవకులు నటుకులు మోహన్, బిల్డర్, ఇంజినీర్ దుంగ సుధాకర్, వైకాపా నాయకులు తంగుడు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది, ఎస్సీ సెల్ నాయకులు పొన్నాడ ఋషి, వైకాపా నాయకులు, కోణార్క్ శ్రీను, వైకాపా మహిళా విభాగం రాష్ట్ర నాయకులు టి.కామేశ్వరి, వైకాపా నాయ కులు మండవిల్లి రవి, సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి, చైతన్య విద్యాసంస్థల ప్రతినిధి శ్రీనివాస్, ఏఐఎం నాయకులు లింగాల మల్లమ్మ, మజ్జి గౌతమ్, జోగిపాటి వంశీ, అబ్బాస్, పెయ్యల చంటి, భూషణ్, కొత్తూరు సత్యన్నారాయణ, లావేరు అప్పారావు, ప్రసాద్, న్యూట్రిషన్ నాగరాజు, బోసు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.



## ఉమాగిరి-బీఎస్ పురంనకు తారురోడ్డు

**- రెండు రోజుల్లో పూర్తయిన రహదారి**

**మందస, సెప్టెంబరు 30(వార్త):** ఎట్టకేలకు ఉమాగిరి-భైరిసారంగపురం రహదారి పనులు పూర్తయ్యాయి. జిల్లుండ పంచాయతీలో గల ఉమాగిరి నుంచి భైరిసారంగపురం గ్రామం వరకు గల రహదారి అధ్వాన్నంగా మారింది. ఇటీవల ఓ స్కూల్ బస్సు కూడా రహదారి బాగులేకపోవడంతో చెరువులో పడిపోయింది. పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురికాగా.. ద్విచక్ర వాహనదారులు చాలాసార్లు ప్రమాదాలకు గురయ్యారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణం పనులు ప్రారంభించింది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.90లక్షలతో 1.20కిలోమీటర్లు పొడవున తారురోడ్డు నిర్మించారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రహదారిని పూర్తి చేయడం విశేషం. ఉమాగిరి, ఉమాగిరికాలనీ, బీఎస్ పురం కాలనీ, గంగిరెడ్లకాలనీలను కలుపుతూ తారురోడ్డు పూర్తి కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మల్లేశ్వరరావు ఆదర్శనీయుడు



**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** ఉపాధ్యాయుడు గదిలి మల్లేశ్వరరావు ఆదర్శనీయుడని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మల్లేశ్వరరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

# చట్టాలు తెలుసుకోండి.. అవగాహన పెంచుకోండి



**శ్రీకాకుళం, సెప్టెంబరు 30(వార్త):** రాజ్యాంగపరంగా చట్టాలు అందరికీ ఒకేలా వర్తిస్తాయని, మత స్వేచ్ఛకు సంబంధించిన భారత రాజ్యాంగంలో ముఖ్యమైన అధికరణలు ఉన్నాయని ప్రముఖ అడ్వకేట్ ఎ.ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ నిర్వహణలో జరిగిన దైవ సేవకులు, నాయకుల సంఘ క్షేమ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాలు తెలుసుకొని అవగాహనతో మెలగాలని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఉమెన్స్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి రమణ మాట్లాడుతూ న్యాయం జరగదన్న ఆలోచనతో బాధపడే బాధితులకు న్యాయస్థానం 90 రోజుల్లో సమస్య పరిష్కరించే దిశగా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆడపిల్లలకు 21, మగ పిల్లలకు 25 సంవత్సరాలు దాటిన వారికి వివాహం జరిపించాలని తెలిపారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డీఎస్‌వీఎస్ కుమార్ మాట్లాడుతూ సంఘ క్షేమం కోరిన వారు ఆదికాలంనాటి సంఘాలు, వాటి పరిచర్యను గమనిస్తారని వర్తమానం అందించారు. విభేదాలు లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌బీఎల్ కుమార్, కే డానియల్, ఒంపూరు రమేష్, శామ్యూల్ మోజెస్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముద్దాయిలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు



**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** సబ్ జైలులో ఉన్న ముద్దాయిలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సబ్ జైలర్ మోహనరావు తెలిపారు. మంగళవారం ఆయన నరసన్నపేట సబ్ జైలును పరిశీలించారు. సబ్ జైల్‌లోని పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని వివరించారు. ప్రతి వారం ముద్దాయిలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యకర సమాజానికే స్వస్త్ నారి స్వశక్త్ అభియాన్ పరివార్



**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** ఆరోగ్యవంతమైన సమాజం కోసం స్వస్త్ నారి స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన నరసన్నపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ప్రధాని మోడీ 2047 నాటికి వికసిత్ భారత లక్ష్యంగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. అనంతరము ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని, మెగా వైద్య శిబిరాన్ని, స్కానింగ్ సెంటర్ కంప్యూటర్ సిస్టమ్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్, సూపరింటెండెంట్, డాక్టర్లు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు ముర్రాట సమర్పణ

**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మడపాంలో మంగళవారం ఉదయం అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. భవానీ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని వేపకొమ్మలతో తిరు వీధుల్లో నాట్యం చేస్తూ వెళ్లారు. ముత్తైదువులు ముర్రాటలు, పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.





## నవరాత్రి పూజల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** స్వేచ్ఛవతి అమ్మవారిని నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఈదుపురం దుర్గదేవి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి సంతు దంపతులు, నర్తు నరేంద్ర యాదవ్, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నారాయణమ్మ, నర్తు ప్రేమ్‌కుమార్, దువ్వు వాసు, ఆనంద్ పాల్గొన్నారు. కొలిగాం, కీర్తిపురం అమ్మవారి



నవరాత్రుల పూజల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సిద్ధిదాత్రి అవతారంలో స్వేచ్ఛావతి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మ వారు దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సిద్ధిదాత్రి అవతారంలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. డబ్బూరి వీధి దక్షిణ కాళీమాత ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతీ దేవిగా కాళీమాతను అలంకరించారు. గ్రామదేవత స్వేచ్ఛవతి ఆలయంలో కూడా సామూహిక అక్షరాభ్యసాలు నిర్వహించారు. సరస్వతీదేవి అవతారంలో వైదేహి మాత అమ్మవారు దర్శనమిచ్చారు. స్వేచ్ఛావతి ఆలయంలో స్వేచ్ఛ నృత్య తరంగిణి నృత్య ప్రదర్శన అలరించింది.





## శిష్టు గోపిపై చర్యలు తీసుకోండి

**పలాస, సెప్టెంబరు 30(వార్త):** సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీపై అసత్య ప్రకటనలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షుడు శిష్టు గోపిపై కేసు నమోదు చేయాలని ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణకు వినతి పత్రం మంగళవారం అందించారు. శిష్టు గోపి సోషల్ మీడియాలో సుమారు 20 అవా కులు చవాకులు పేలారన్నారు. సీఐను కలిసిన వారిలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ వజ్జ బాబురావు, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, రవి శంకర్ గుప్తా, చంద్రశేఖర్ త్యాడి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ బుక్ బ్రహ్మాస్త్రం




**పోలాకి, సెప్టెంబరు 30(వార్త):** కూటమి నాయకుల అక్రమ వేధింపులతో ఇబ్బంది పడుతున్న వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు జగన్ తీసుకొచ్చిన బ్రహ్మాస్త్రమే డిజిటల్ బుక్ అని పోలాకి ఎంపీపీ భైరాగినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయ ఆవరణలో ఆయన డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారావు, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.వి.రమణి, కామేశ్వరరావు, వసంతరావు పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభమెప్పుడు?



**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఇటీవల కుట్టు శిక్షణ కేంద్రాలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసింది. నరసన్నపేట మూడవ సచివాలయ పరిధిలో ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు మూడు నెలల కిందట కుట్టుమిషన్లను అందించారు. కానీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోకపోవడం శోచనీయం. సుమారు 30 కుట్టుమిషన్లు కేంద్రానికి చేరుకున్నా శిక్షణ మాత్రం సాగడం లేదు.

## ఘనంగా నీలమణి దుర్గ జాతర

**పోలాకి, సెప్టెంబరు 30(వార్త):** పాతపట్నం నీలమణి దుర్గా అమ్మవారి 15వ వార్షికోత్సవ జాతర పోలాకిలో మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ వేడుకలో మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, పప్పల ధర్మారావు, బోర వెంకటరమణ, బటన రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

**-మంత్రి అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 30(వార్త):** నిరుపేద వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంగళ వారం 21 మందికి రూ.23 లక్షలు లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టమైనా అభివృద్ధి, సంక్షేమం దిశగా చంద్ర బాబు పాలన అందిస్తున్నారన్నారు. జగన్ ఆర్థిక అరాచకాలు సృష్టించి, అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని విమర్శించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్దిదారులు ముఖ్యమంత్రికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, ఆర్డీవో కృష్ణమూర్తి, తెలుగు దేశం పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లి ఆలయంలో అనుమతి లేకుండా ప్రసాద విక్రయాలు



**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 30(వార్త):** కొత్తమ్మతల్లి ఆలయంలో ఎలాంటి అనుమతులు లేకుండా భక్తులకు ప్రసాద విక్రయాలు జరుపుతున్నారు. దేవదాయశాఖ అధికారులు ఈ ఏడాది వేలం పాట నిర్వహించకపోవడంతో కొందరు వ్యక్తులు దర్జాగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రసాదం విక్రయిస్తున్నారు. విక్రయదారులు కాలం చెల్లిన లడ్డులు, పాచిపోయిన పులిహోర ప్రసాదం రూపంలో ఒకొక్కటి రూ.10లు చొప్పున అధిక ధరకు విక్రయిస్తున్నారని భక్తులు వాపోతున్నారు. విక్రయదారులకు, ఆలయ అధికారులకు ఏదైన లాలూచీ ఉందా అని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణను వివరణ కోరగా ప్రసాద విక్రయాలలో ఎలాంటి అనుమతులు ఎవ్వరికి ఇవ్వలేదని స్పష్టం చేశారు.

# సంప్రదాయంగా దసరా వేడుకలు

**-గ్రామాల్లో పండగ వాతావరణం**

**మందస, సెప్టెంబరు 30(వార్త):** గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మంగళవారం ప్రతీ గ్రామంలో రైతులు, మహిళలు ఆయా గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలను తీసుకెళ్లి, అమ్మవార్లకు పసుపు నీళ్లతో చల్లదనం చేశారు. అనంతరం మొక్కులు చెల్లించారు. ఆనవాయితీగా వస్తున్న గ్రామదేవతల వద్ద పూజించిన పత్రిని రైతులు తీసుకుని, వరిపొలాల్లో వేశారు. దీంతో పంటలు సక్రమంగా పండుతాయని రైతులు నమ్మకం. దసరా సందర్భంగా వలసలు వెళ్లిన ప్రజలు తమ గ్రామాలకు చేరుకుని, అందరితో కలసి, సరదాగా గడిపారు. తెలుగువారి వంటలు చేసుకుని, సంతృప్తిగా భుజించారు. మందస రాజుల కాలం నాటి నుంచి ఆనవాయితీగా వస్తున్న కిల్లమ్మ తల్లి తిరిగి పిడిమందస వెళ్లిపోవడంతో ప్రజలు దసరా పండగను చేసుకుంటారు.



## వైభవంగా కాశీబుగ్గ రామాలయంలో సామూహిక అక్షరాభ్యాసం

**పలాస, సెప్టెంబరు 30(వార్త):** పలాస-కాశీబుగ్గ రామాలయంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సరస్వతి దేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి బ్యాచ్‌ల వారీగా అక్షరాభ్యాసాల్ని చేపట్టారు. ఆలయ చైర్మన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మ వారి జన్మ నక్షత్రం సందర్భంగా, సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్న ఈ శుభసందర్భంగా సుమారు 200 మంది పిల్లలతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. తాగునీరు, పిల్లలకు పాలు, అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# షిరిడి సాయిబాబా పుణ్య తిథికి ఆహ్వానం

**పలాస, సెప్టెంబరు 30(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి శివాజీ నగర్‌లో గల సాయి మందిర ప్రాంగణంలో గురువారం ఉదయం నుంచి విశేష పూజలు ఆలయ ప్రధాన అర్చకులు ధర్మపురి వాయునందన శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ ట్రస్ట్ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ (బాబా) తెలిపారు. భక్తుల చేతుల మీదుగా పాలాభిషేకం.. మధ్యాహ్నం 11: 30 లకు అన్నప్రసాదం, ఏక నామ సంకీర్తన ఏకాహము, ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ భక్తుల ఏక కంఠంతో స్మరణ జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



# ప్రతి పేదవానికి పక్కా ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

**-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, సెప్టెంబర్ 30(వార్త):** ప్రతీ పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకెళ్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

కొత్తపేట గ్రామానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వం ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో అందరికీ పక్కా ఇళ్ల పథకాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ నాలుగేళ్లలో ప్రతి పేదవానికి అర్బన్‌లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ప్రజలందరికీ అభివృద్ధి , సంక్షేమ ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.



అనంతరం ఆరుగురికి అంగన్వాడీ సహాయకులుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, ఆర్డీవో కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

# రేపటి నుంచి జన చైతన్యం..కార్యకర్తలతో మమేకం



**నరసన్నపేట, సెప్టెంబరు 30(వార్త):** వైఎస్ఆర్సీపీ యువ నేత కృష్ణచైతన్య ఈ నెల 2న దసరా పండుగ సందర్భంగా కార్యకర్తలతో మమేకమయ్యే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గ్రామ స్థాయి నాయకులు, కమిటీ సభ్యులను కలిసి, సమస్యలు తెలుసుకుని, పరిష్కార మార్గాలపై చర్చించనున్నారు. ఈ కార్యక్రమం 70 క్లస్టర్లలో 36 రోజుల పాటు కొనసాగనుంది. మంగళవారం నరసన్నపేట వైఎస్ ఆర్సీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరంగి మురళీధర్ మాట్లాడుతూ కార్యకర్తలతో నేరుగా చర్చలు జరపడం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ లు, మండల అధ్యక్షులు, సర్పంచులు, పార్టీ విభాగాల నేతలు పాల్గొన్నారు.

# ఏపీ గ్రామీణ బ్యాంక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**మందస, సెప్టెంబరు 30(వార్త):** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కరస జనార్ధన్ కోరారు. మందసలోని ఏపీజీబ్యాంక్ పరిధిలో మంగళవారం కళాజాతర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలపై అవగాహన పొందాలన్నారు. ప్రతీ ఖాతాదారుడు బీమా పథకాల ద్వారా వచ్చే బెనిఫిట్స్ తెలుసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ద్వారా ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా మంజూరవుతున్న సోలార్ సిస్టం పథకం సబ్సిడీతో మంజూరు చేస్తామన్నారు. ఈ పథకం ఎంతో మేలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్ ద్వారా పలు పథకాలు, డిపాజిట్లు, ఆర్డీలు అందుబాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలకు



బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించాలన్నారు. ఈ జాతరలో కళాకారులు ఏపీ గ్రామీణ బ్యాంక్ సేవలు, పథకాలను చక్కగా వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయిచరణ్, అకౌంటెంట్ సరోజని, క్యాషియర్ కోటేశ్వరరావు, సీఎస్పీలు, ఖాతాదారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ క్రీడాకారుడికి రూ. 35 వేల వితరణ



**పలాస, సెప్టెంబరు 30(వార్త):** ఎందరో వాలీబాల్ క్రీడాకారులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది నేడు అనారోగ్యంతో బాధపడుతున్న బాలపుట్టి గ్రామానికి చెందిన కె. జగ్గారావుకు పల్లి సారధి గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు సుమారు రూ.35వేల ఆర్థిక సాయం మంగళవారం అందించారు. కార్యక్రమంలో జేటీఆర్ యువసేన సభ్యులు రొయ్య నారాయణరావు, జనసేన పార్టీ నాయకులు ఉప్పరపల్లి సతీష్, మోహన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు తామాడ నాగరాజు, దుర్యోధన, ప్రసాద్, చక్రవర్తి, జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారులు బల్ల లోకనాథం, సురేంద్ర సాహూ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రణాసురమ్మ సంబరాలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** ఇచ్ఛాపురంలోని ఉప్పాడ వీధి రణాసురమ్మ దుర్గాష్టమి పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారి ఆలయం నుంచి ఉప్పాడ వీధి, కొయ్య వీధి, నీలకంటేశ్వర వీధి, కృష్ణ బజార్ వీధి, కార్జీ వీధి నుంచి దానం పేట మీదుగా పీర్ల కొండ సూది కొండ మధ్యలో ఉన్న పుట్ట వరకు యాత్ర సాగింది. అక్కడ పూజలు నిర్వహించి కోడి పిల్లను సజీవంగా విడిచి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం మొక్కుబడులు చెల్లించారు. ఆసి జానీ రెడ్డి పూజారిగా వ్యవహరించారు. పరిసర వీధి ప్రజలు, యువకులు, మహిళలు, భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తేలుకుంచిలో ఆశిరమ్మ తల్లికి జలాభిషేకాలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** తేలుకుంచిలోని ఆశిరమ్మ తల్లికి మంగళవారం జలాభిషేకాలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుమారు 200 మంది మహిళలు భవానీ మాల ధరించి పూజలు నిర్వహిస్తున్నారు. దుర్గాష్టమి సందర్భంగా మద్ది హిమ శైలజ రెడ్డి ఆధ్వర్యంలో జలాభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురం పట్టణ టీడీపీ కార్యదర్శి ఉదారత

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు బెల్లు పడా కాలనీలో విద్యుత్ లైట్ల సమస్యను పరిష్కరించేందుకు పట్టణ టీడీపీ కార్యదర్శి శాసన శేఖర్ నడుం బిగించారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వీధి లైట్లు వెలిగించకపోవడంతో ప్రజలు దసరా నవరాత్రి రోజుల్లో చీకట్లో పడుతున్న ఇబ్బందులు గమనించారు. ఇందులో భాగంగా సొంత సొమ్ముతో ఐదు విద్యుత్ స్తంభాలపై కొత్త బల్బులు వేయించారు. పాడైన లైట్లను బాగు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన శాసన శేఖర్‌ను స్థానికులు అభినందించారు.



# ఫకీరు పేటలో భారీ అన్నదానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు30(వార్త):** ఫకీరు పేట జంక్షన్ లో దుర్గా నవరాత్రుల సందర్భంగా మంగళవారం డాక్టర్ ఉలాల కోదండరామ్, జ్యోతి దంపతుల సౌజ న్యంతో సుమారు రెండు వేల మందికి మంగళవారం అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉలాల కోదండరామ్ రూ.51వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కోదండరామ్ దంపతుల కుమారుడు కీర్తివర్ధన్, కుమార్తె గేష్ణవర్షిణి పాల్గొన్నారు. దుర్గాదేవికి వైభవంగా పూజలు నిర్వహించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546